# 7. జాక్‌పాట్ సాహిత్యం

నూటికి తొంభయ్యయిదుగురు దరిద్రంలో సుఖ స్వప్నాలుచేసే సమాజంలో వాళ్ళకేవేనా దూరపు కొండలూ, వాటిమీద టెక్నికలర్ ఆశల పుష్పాలూ చూపించకపోతే ఆపటం కష్టం. కనుకనే రేసులు, లాటరీల్లాంటివి పుట్టుకొచ్చి తెల్లారేసరికల్లా అందరూ లక్షాధికారులు కాగల సోషలిజానికి దగ్గరి జాక్‌పాట్ దారులు వేశాయి.

మనకు బుర్రంటూ ఒటున్నాక దానికి కాస్తకాలక్షేపం వినోదం, ఉల్లాసం కలిగించటానికి నట, విట, గాయక, రచయితల్తో ఓ విదూషక బృందం కూడా తప్పనిసరి. మరి ఈ దరిద్రులకూ్కడా ఏవేనా కలర్ ఆశలు లేకుంటే ఎలా? అందుకే ఏటేటా ఈ నిర్భాగ్యులకు పదహార్లూ, వేయినూటపదార్లూ ఉదారంగా ముష్టివేసే సాహిత్య కంపెనీలు కొన్ని బయలుదేరాయి. దాంతో ఈ బృందం ఆ కంపెనీల చుట్టూ తిరుగుతూ- ఆయా బహుమతుల కోసం చేయవలసిన చెక్కభజన చేస్తూ, పట్టవలసిన వాళ్ళ కాళ్ళుపడుతూ- లేస్తూ యథాశక్తి తమ కష్టాలు మరచి సాహిత్య సేవ చేస్తుంటారు.

కానీ, అసలే మన సోషలిస్టు రూపీ డివాల్యుయేషన్‌తో తగ్గింది చాలక ఈ లాటరీలూ, రేసులూ విజృంభించి పదా

ర్లకూ, వేయిన్నూటపదార్లకూ విలువ లేకుండా చేసేశాయి. కనుక సాహిత్యంలో కూడా జాక్‌పాట్లు లేకుంటే లాభం లేదని కొందరు ఉదారులు లక్షరూపాయల జాక్‌పాట్‌తో జ్ఞానపీఠ నోదాన్ని సృష్టించారు.

శుభం.

లక్ష రూపాయలంటే మాటలా? దాంతో ఏభయి వేలదాకా అన్ని స్టేట్ లాటరీ టికెట్లూ కొనవచ్చును. దేవుడో, సరస్వతీ దేవో దయదలిస్తే మరిన్ని లక్షలూ, కోట్లూ సంపాదించవచ్చు.

జ్ఞానపీఠం వారి లక్షరూపాయల సాహిత్య జాక్‌పాట్ ఈసారి మన కవి సామ్రాట్టు, కళా ప్రపూర్ణ, సాహిత్య డాక్టర్ విశ్వనాథ సత్యనారాయణ గారికి రావటం మనందరికీ గర్వకారణం. ఈసారి మనం ఏ ఢిల్లీయో, కలకత్తాయో వెళ్ళినపుడు అక్కడ సగర్వంగా పిలక ఎత్తుకుని చెప్పుకోవచ్చు మన తెలుగూ సాహిత్య ఘనతను గురించి.

ఇంతవరకూ భారతదేశం మొత్తంమీదనే మరో అయిదు గురు మాత్రం సాధించగలిగిన ఈ జాక్‌పాట్‌ను కొట్టగలిగిన విశ్వనాథవారి "రామాయణ కల్ప వృక్షం" చదవటం సంగ తలా ఉంచి కనీసం చూసి అన్నా తరిద్దామని తహతహ లాడి పోయాను.

"ముందు తరాల విమర్శకులు విశ్వనాథ వారిని గొప్ప

కవిగాగాక పెద్ద నవలా రచయితగా గుర్తిస్తారు. ఆయన నవల లన్నిటిలోకి 'రామాయణ కల్పవృక్షం' చాలా గొప్ప దంటారు'' అని దివ్య దృష్టిగల ఓ మహాకవి గారు ఏనాడో సెలవిచ్చారు.

కనుక, నేనో పుస్తకాల దుకాణానికి పోయి 'ఫలానా నవల కావాలండి' అంటే అక్కడి సాహిత్య విక్రయకుడు నన్నెగాదిగా చూసి "ఆ పేరు గల నవలేదీ లేదు నాయనా! ఛందో బందో బస్తులతో పకడ్ బందీగా అల్లిన విశ్వనాధవారి కావ్యం మాత్రం ఉంద''న్నాడు.

''నాకు సంస్కృతం అంతగా రాకున్నా సంస్కృత రామాయణం చదివి అర్థం చేసుకుని, ఆనందించ కలిగాను గానీ- తెలుగు బాగా వచ్చి ఉండి కూడా విశ్వనాధవారి తెలుగు 'రామాయణ కల్ప వృక్షం' మాత్రం చదవలేక పోయాను. వారిది పాషాణ పాకం' అని ఏనాడో శ్రీశ్రీ అన్న మాటలు గుర్తుకొచ్చి అ షావువాడికీ, వాడి అటకమీది ఆ జాక్‌పాట్ గైడ్‌కూ ఓ దండం పెట్టివచ్చేశాను.

విశ్వనాధవారు కారణజన్ములు. మన తెలుగు సాహిత్యాన్ని, హిందూమత ప్రభావాన్ని ఉద్దరించేందుకే వారు పుట్టారనటంలో సందేహం ఉన్న వారికి ఈజన్మలో జాక్‌పాట్ రాక పోగా సరాసరి నరకానికే పోతారు. విశ్వనాధవారే ఓ సారి చెప్పుకున్నారు. ''నా అంతటివాడు మరో వెయ్యేళ్ళదాకా

పుట్టబోడు అని. ఎవరో అన్నారు గదా! నిజమే! మహాప్రభో! తమరు వెయ్యేళ్ల క్రితమే పుట్టేరు ఇప్పుడు మమ్మల్ని అవస్త పెడుతున్నారు" అని. ఏది ఏమైనా మరో వెయ్యేళ్ళ తరువాత కూడా విశ్వనాధవారి వంటి మహానుభావుడు పుట్టబోడనేది మాత్రం నిస్సందియమే.

విశ్వనాథ వారికి వ్యాకరణ, ఛందో, అలంకార శాస్త్రాల్లో సదా నూటికి నూటయాభై ఒకటిన్నరమార్కులు వచ్చేవట. అదీ వారి దర్జా. వారి వేయి పడగలు, కిన్నెర సాని పాటలు, రామాయణ కల్పవృక్షం, హాహా! హిహీ! హుహూ! లాంటి ఉద్గ్రంథాల్లోని మన మట్టి బుర్రలకు తెలీని గొప్పల్ని, ఉన్న-లేని అందాల్నీ, కీర్తిస్తూ శ్రీవారి శిష్యులూ, భక్తులూ వందలాది వ్యాసాలు రాసి భారతి వంటి పత్రికల పేజీల్ని ఈ వరకే నింపివేశారు. ఇప్పుడు మనం అదనంగా పరిశోధించి పట్టుకునేందుకు ఏమీ లేదు.

'పురాణ వైర గ్రంథమాల' అంటూ విశ్వనాథ వారి మధ్య ఓ డిరువాడు నవలల్ని లైబ్రరీల మీదికి వదిలేరు. అంత వేగంగా అన్ని నవలల్ని వ్రాయగలగటం నిస్సందేహంగా గొప్ప సంగతే.

మన చరిత్రకారులు చరిత్రను సరిగా రాయలేదనీ, అదంతా తప్పులకుప్ప అని విశ్వనాథ వారు తమ దివ్యదృష్టి వల్ల కనుగొన్నారు. కనుక ఆ తప్పులన్నీ సవరించి చరిత్రను

స్వచ్ఛంగా, తిరపతి వెళ్ళొచ్చిన గుండులా సవరించి బ్రాహ్మణాధిక్యతనూ, బ్రాహ్మణేతరుల నీచత్వాన్నీ సవివరంగా వరిణ్నూ తాము కలల్లో కనుగొన్న చారిత్రక సత్యాలన్నింటినీ నవలలుగా మన కందించేందుకు ఓ కంకణం స్పెషల్‌గా కట్టుకున్నారు.

వారి ఉద్దేశ్యం ఏమయినప్పటికీ ఈ నవలల పుణ్యమా అని తెలుగు సాహిత్యంలో హాస్య రచనలు అంతగా లేని లోటు మాత్రం తీరిపోయింది. ఓపిక గల పాఠక మహాశయులీ నవలల్లో అద్భుత విషయాలెన్నో తెలుసుకుని చైతన్య వంతు లవగలరు. ఉదాహరణకు ఓ నవలలో "అచ్చోట నొక వాగు యున్నది!" అంటారు విశ్వనాథవారు. 'అక్కడనే ఎందుకు యున్నది?' అని మరలా వారే ప్రశ్నించి 'యుండవలె గనుక యుండె' అని రకీమని జవాబిస్తారు. ఇంతకన్నా క్లుప్తంగా, గొప్పగా చెప్పి పాఠకుల నోళ్ళూ, బుర్రలూ మూయించగల ఘనులింకెవరన్నా మన తెలుగు వాళ్ళలో ఉన్నారా?

విశ్వనాథవారి పురాణ వైర గ్రంథమాలా శైలి అద్భుతం. అంత గొప్పగా వాల్మీకికూడా వ్రాయలేదు. పైచెప్పిన వాగునే తీసుకుందాం: ఆ వాగు అక్కడ ఎందుకుందో బల్లబద్దలు గొట్టి చెప్పాక, "అసలు వాగు అనగా నేమి, అదెట్లు పుట్టును" అనే శాస్త్ర చర్చ మొదలెడతారు శ్రీవారు.

అక్కడెక్కడో కొండ లుండెను. వాటిపై మంచు

పేరుకొనుచు, అది కరిగి నీరుగా ప్రవహించును. ఆ పిల్ల వాగులు అలా అలా అలా రాళ్ళను ఒరుసుకుని, కరగదీసి, ప్రవహించి పెద్దవై వాగుగా మారును.

ఇది విశ్వనాథ వారి ధోరణి. అంత గొప్ప విషయా న్నింత సులువుగా మామిడి రసం పిండి గొంతులో పోసినంత సులువుగా మరెవరేనా చెప్పగలరా?

తాము చెప్పిందే వేదం, రాసిందే ప్రామాణికం- దానికి తిరుగులేదనేది సకల సాహిత్య శాస్త్రాలూ ఆపోశనం పట్టిన విశ్వనాథ వారి దృఢాభిప్రాయం. "తందాన" అనటమే వారి శిష్యుల క్వాలిఫికేషన్. అందుకే గాబోలు వళ్ళుమండి ఓ సారి కొత్త సత్యనారాయణ చౌదరిగారు "నాయనా! విశ్వనాథా! నీకేం తెలీదు. నీకే శాస్త్రమూ సరిగా రాదు నీ రామాయణ కల్పవృక్షం వాల్మీకికే అపచారం. అందులో పద్యాలు వజ్రపు తునకలు కావు. రాళ్ల ముక్కలు, నాయనా, రాళ్ళ ముక్కలు" అని విరుచుకపడి ఆ విషయాన్ని సశాస్త్రీకంగా నిరూపించారు. ఓ ఆర్నెల్లపాటు నానా సాహిత్య గొడవా, రగడా జరిగాక విశ్వనాథ వారిక ఈ సాహిత్య నాస్తిక దుర్మార్గుల్తో వాదించలేక "నాయనలారా, నా మేడ మీద గదిలో నేనొక్కడినే ఒంటరిగా పడుకుంటూం టాను. మీ కంతకసిగా ఉంటే ఓ సైనేడ్ బుడ్డీ విసరేయ గూడదా! ఇలా చిత్రవధ చేయనేల" అంటూ చేతులెత్తేసి మరీ వాపోయారు. ఆ తుఫాను వెలిసిందగ్గర్నుంచీ శ్రీవారు

అహంకారం కాస్త తగ్గించుకుని ప్రశాంతంగా పురాణ వైర గ్రంధమాలలో తమ మానసిక దురదలన్నింటినీ సాహిత్య పరంగా గోక్కోనారంభించారు. అందుకే దేముడు దయ దలచి జ్ఞాన పీఠ జాక్‌పాట్ రూపంలో అనుగ్రహించినట్లున్నాడు.

ఆ సంగతి కూడా విశ్వానాధవారే చెప్పుకున్నారు. "నా గ్రహబలమే ఈ జ్ఞాన పీఠం బహుమతి అనుగ్రహాఫలం" అని. శ్రీవారే స్వయంగా చెప్పుకున్నారంటే మనం చచ్చినట్టు నమ్మాల్సిందే. ఇపుడు నాకు బుధమహార్దశ వచ్చింది. నా జాతకం అలా ఉంది. కనుకనే ఎన్ని లాటరీ టిక్కెట్లు కొన్నా రాని ప్రైజు ఏ టిక్కెట్టూ కొనకుండానే వచ్చి నా కాళ్ళమీద పడింది. అంటున్నారు విశ్వనాథవారు.

మరి రామాయణ కల్పవృక్షం సంగతేమంటారా! అయ్యో, తమరుత్త అమాయకులు. ఇవన్నీ నశ్వరాలు. నిమిత్త మాత్రాలు. విశ్వనాథ వారే సెలవిస్తున్నట్లు ఇవన్నీ వ్రాయువాడూ, ఇప్పించువాడూ, ఇచ్చువాడూ, పుచ్చుకొను వాడూ, తినువాడూ లేదా దాచుకొని వడ్డీ కిచ్చువాడూ అంతా ఆపరంధాముడి చేతి కీలుబొమ్మలే

(ఆగస్టు 1971)